ఇప్పుడు ఆ యావలో పడిన అప్పారావుకి గనికొండ గొడవలు గుర్తు రావడంలేదు.

కొన్నిరోజులపాటు ప్రజల కళ్ళు బడకూడదని ఓ మూల గదిలో దాచిన నానీని గురించీ ఆలోచనలు లేవు-

తను నిలబడ్డ చీకటి గది కిటికీ తెరుచుకుంటూ ఓ ఆకారం లోపలికి దూకింది.

భయంగా కళ్ళు చిట్లించాడు.

కెవ్వుమంటూ కేక వేయబోయాడు. కాని అప్పటికే ఆలస్యం అయింది.

గదిలోకి వస్తున్న మసక వెలుతురులో ఓ మూల నిలబడ్డ నానీ నోటిని చేతితో బలంగా నొక్కిన అగంతకుడు "భయపడకు- నిన్ను రక్షించాలనే వచ్చాను" అన్నాడు నెమ్మదిగా....

వచ్చింది రాజారావు కాదని తెలిసిపోయిన నానీ ఇక అల్లరి పెట్టలేదు. స్పష్టంగా కనిపించని ఆ వ్యక్తి ఎవరయి ఉంటారా అని విస్మయంగా చూస్తున్నాడు.

ఇన్వెస్టిషన్ జర్నలిజంలో ఎన్నో ప్రమాద భూయిష్ఠమైన పరిస్థితులకు అలవాటు పడిన రాందేవ్ చాలా రిస్కు తీసుకుని కాంపౌండ్‌వాల్ దాటి నానీ గదికి చేరుకున్నాడు....

నానీ చేత నిజం కక్కించాలని, మరుగుపడిన ఆ నిజాన్ని తన 'నిజం' పత్రికద్వారా ప్రజలకి తెలియపరచాలని మాత్రమే అంతవరకూ అనుకున్నది....

కాని కిటికీలోనుంచి మరో దృశ్యం కంటపడగానే మనస్సు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయింది. వచ్చింది ఒకందుకయినా అలవాటుగా తన కెమెరాని తీసుకురావడంతో అదెంత ఉపయుక్తమైందీ అని ఉత్సాహంగా అనుకుంటూనే కిటికీకి అభిముఖంగా నడిచాడు.

ఈ ఒక్క సన్నివేశాన్ని దినపత్రికలో ప్రచురిస్తే చాలు. అది అనూహ్యమైన సంచలనానికి దారి తీస్తుంది, దీనితో అప్పారావులాంటి ఓ అవినీతిపరుడికి పదవి పోవచ్చు లేదా రాజకీయ యంత్రాంగమే కుప్పకూలిపోవచ్చు.

ఏది ఏమయినా కొన్ని నెలలపాటు ప్రజలు విడ్డూరంగా చర్చించుకునే న్యూస్ అవుతుంది.

ఫ్లాష్ మెరిసింది చీకటి గదిలోనుంచి

ముందు అర్థంకాలేదు గదిలోని అప్పారావు, కామేశ్వరిలకు...

మరో ఫ్లాష్....

శృంగారంలో పరాకాష్టని చేరుకున్న ఇద్దరికీ అప్పటికి ఏదో జరగకూడనిది జరుగుతూందని అనిపించినా ఆ మూడ్‌లోంచి వెంటనే తప్పుకోలేకపోయారు.

ఇంకోసారి కెమేరా ఫ్లాష్ వెలిగింది.

కామేశ్వరి పట్టు సడలించింది.

అప్పారావు ఒక్క ఉదుటున బెడ్ పైనుంచి లేచాడు.

ఇక ఆలస్యం చేయలేదు రాందేవ్.

ప్రమాదం చాలా వేగంగా ముందుకొస్తూందని గ్రహించడంతో నానీని పైకెత్తుకుని ద్వారం తెరిచి బయటకు పరుగెత్తాడు.

అప్పటికే తుండుగుడ్డని మొలకి చుట్టుకున్న అప్పారావు కారిడార్లోకి వచ్చాడు.

రెప్పపాటులో గెస్ట్ హౌస్ ఆవరణలో లైట్లు వెలిగాయి.

పియ్యే కోసం కేకపెట్టాడు. కాని ప్రయోజనం లేకపోవడంతో తనే కాంపౌండ్ వాల్ దాకా వెంటపడ్డాడు.... కాని ప్రయోజనం లేకపోయింది.

వచ్చింది ఎవరో గుర్తుపట్టిన అప్పారావు నుదుట ముచ్చెమటలు పోశాయి.

తన రెండు దశాబ్దాల రాజకీయ చరిత్ర సమాధి కాబోయే చివరిక్షణం ఆసన్నమయినట్లు అర్థంకాగా వేగంగా వెనక్కి పరిగెత్తుకొచ్చాడు.

"వాడు...." కామేశ్వరి అర్ధనగ్నంగా నిలబడే అరిచింది "నానీ.... మా ఊరోడే... ఆ యశస్విని ట్రాన్స్‌ఫర్ చేయించమన్నది ఈ పిల్లాడి...." రొప్పుతూ టెలిగ్రాఫిక్ కోడ్‌లో చెప్పింది గడగడా-

జంటగా యిద్దరూ యిరుక్కుపోయామని అర్థమయిన అప్పారావు ఇప్పుడు ఈ కాకతాళీయం గురించి బేరీజు వేసుకొంటూ నిలబడలేదు.

ఈ నిప్పు రవ్వలు దావానలం కాకముందే ఆర్పేయాలనుకున్నాడు.

ఫోన్ రిసీవర్ని అందుకొని తొట్రుపాటుతో ఎక్కడికో ఫోన్ చేశాడు. "నేనే అప్పారావుని. రాందేవ్‌గాడు తెలుసుగా.... వాడు.... నేను మరో గుంటతో ఉండగా ఫోటోలు తీసి పారిపోయాడు. వాడితో నానీ అని మరో పిల్లాడున్నాడు. ఇద్దరూ కడతేరిపోవాలి....ఆ తరువాత ఏం చేయాల్సింది చెబుతాను. ముందు వాళ్లని ఫినిష్ చెయ్....ఆ! వెంటనే....".

ఇక్కడ అప్పారావు కంగారుపడుతుండగా మోటార్‌బైక్ స్టార్ట్ చేసిన రాందేవ్ నానీని వెనుక కూర్చోబెట్టుకుని టౌన్‌వేపు దూసుకుపోతున్నాడు.

సరిగ్గా అదే సమయంలో వెనక ఓ టాక్సీ కదిలింది.

క్షణం క్షణం తన చేతుల్నుంచి తప్పించుకుంటున్న నానీని ఎలాగన్నా కడతేర్చిగాని ఇంటిముఖం పట్టకూడదని గట్టిగా నిర్ణయించుకున్న రాజారావు కొన్ని గంటల క్రితమే ఓ టాక్సీ అద్దెకు తీసుకుని గెస్ట్ హౌస్‌కి సమీపంలో కాపు వేశాడు తను ఇద్దరు అనుచరులతో.

నిజానికి మరో గంట తర్వాత తనే గెస్ట్‌హౌస్‌లో అడుగుపెట్టి నానీని చంపాలనుకున్నాడు. హోమ్ మినిష్టర్ ప్రాపకంలో వుండగా నానీ ప్రాణాలు తీస్తే ఆ నేరాన్ని కప్పిపుచ్చుకునే భాధ్యత అతడిదే అవుతుందని భావించాడు. కాని యింతలో నానిని మరెవరో బయటికి తీసుకొచ్చారు.

"స్పీడు పెంచు" టాక్సీ డ్రయివర్‌ని హెచ్చరించాడు రాజారావు.

తనను తీసుకెళుతున్నదెవరో తనెలాంటి వుచ్చులో కూరుకుపోతున్నాడో తెలీని నాని

బండి నడుపుతున్న రాందేవ్ ప్రశ్నలకి ఒక్కో జవాబు చెబుతున్నాడు ఆ స్థితిలో కూడా.

పగలు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అప్పారావు చెప్పినదంతా అబద్ధమని గ్రహించేసిన రాందేవ్ ఇన్నాళ్లకి ఓ ఏనుగు కుంభస్థలాన్ని కొట్టే పదునయిన అవకాశం వచ్చినందుకు ఉద్వేగపడుతూనే బండిని వేగంగా నడుపుతున్నాడు.

టౌన్‌లోని నిర్మానుష్యంగా ఉన్న రోడ్డువైపు వెళుతూ ఆలోచిస్తున్నాడు. తమ వెంటనే సురక్షితమైన ప్రదేశంలో తల దాచుకుంటే తప్ప ఈ వార్త వెలుగు చూడదు.

అతడి అనుమానాన్ని బలపరుస్తూ వెనక టాక్సీ చప్పుడు.

అది మామూలుగా ప్రయాణం చేస్తున్నట్టులేదు.

వెంటాడుతూందని గ్రహించడానికి మరో అరక్షణం పట్టింది.

"నానీ.... నన్ను గట్టిగా పట్టుకో..." ఏక్సిలేటర్ తిప్పి వేగాన్ని పెంచుతూ థియేటర్ పక్కనున్న రోడ్డువైపు మళ్లించాడు.

వెనుక టాక్సీ కూడా అదే రోడ్డుపైకి తిరిగింది.

రాందేవ్ వెన్నులో సన్నగా చలి మొదలయింది.

ఆ క్షణంలో రాందేవ్ తీసుకున్న తప్పుడు నిర్ణయం సరాసరి పత్రికాఫీసుకి వెళ్ళాలనుకోవడమే.

బైక్ ని ఖాళీ స్ట్రీట్‌లోకి డ్రైవ్ చేశాడు. అంత సేపూ వెనకవస్తూన్న టాక్సీని అనుమానించాడుగాని.... కొన్ని క్షణాల క్రితమే పత్రికాఫీసుని చేరేసరికి ఓ జీప్ తనకోసం తన కభిముఖంగా ప్రయాణం చేస్తూ వస్తుందని వూహించలేకపోయాడు.

మరో రెండు నిమిషాలు గడిచిందో లేదో ఓ మూల ఆగిన జీపులోంచి రివాల్వర్ పేలిన శబ్దం....

గాలిని చీల్చుకుంటూ వచ్చి తూటా రాందేవ్ భుజాన్ని చేరింది.

కొద్దిగా బేలన్స్ తప్పబోతూ కంట్రోల్ చేసుకున్న రాందేవ్, ఈ సారి మరో తూటా పొట్టలోంచి దూసుకుపోయేసరికి కళ్లు బైర్లు కమ్మినట్టయింది.

బండిని అదుపు చేసే శక్తి కూడగట్టుకుంటూ సందులో నుంచి కుడిపక్కకి ఓ కిలోమీటరు దూరందాకా ప్రయాణం చేశాడు.

సత్తువ సన్నగిల్లి పోయిందప్పటికే. ప్రాణాలు పోతున్నట్టుగా అనిపిస్తుంటే బండిని ఓ వార ఆపి నేలపై పడిపోయాడు.

"నా...నీ..."

తానేమౌతానోనని ఆ పసికందు కళ్లనీళ్ళు పెట్టుకుంటున్నాడని రాందేవ్‌కి తెలీదు. తెలుసుకునే వ్యవధి లేదు. కెమేరాలోని రోల్ ని తీసి నానీకి అందించాడు "ఇది...ఇది- తీసుకుని పోలీసుల కందిందు. వీళ్లకి కనిపించకు. పారిపో...."

"ఇందులో ఏముంది...." భయంతో వెక్కిపడుతూనే అడిగాడు.

“నిజం”

నానీకి ఇష్టమైందీ.... నిజమే

రాందేవ్ ప్రాణాలు కడగంటిపోతున్నాయి. ఆ వాక్యం నానీకి ఊపిరిపోసినట్టయిది.

పేంటుజేబులో పెట్టుకున్నాడు.

ఆక్కడికి ముందుగా చేరింది రాజారావు

“వె....ళ్ళి....పో...” రాందేవ్ దూరంగా నిలబడ్డ టాక్సీని చూస్తూ అరిచాడు.

నానీ కదలబోతున్న సందుకి మరోపక్క ఆగిన జీప్‌ని చూశాడు.

అందులోంచే ఇందాక రివాల్వర్ పేలింది.

ఓ భారీ విగ్రహం బయటకు వచ్చింది దూకుడుగా.

హోం మినిష్టర్ అప్పారావుకి అతి ముఖ్యమైన అనుచరుడిగా ఎన్నో హత్యలు చేసి కూడా ఇంకా విచ్చలవిడిగా తిరిగే ఆ వ్యక్తి పేరు ‘హరి’ అనికానీ, ఆ పట్టణంలో అతడి పేరు విన్న పోలీసు బలగం సైతం హడలి పోతుందని గాని తెలీని నానీ ఓ లిప్తపాటా వ్యక్తినే చూశాడు.

మరుక్షణం రాందేవ్ మాటలు గుర్తుకురాగా వెనక్కి పరుగెత్తబోయాడుగాని రాజారావు తనవైపే రావడం కనిపించింది.

ఇప్పుడు తన ప్రాణాల కోసం రెండు బలమయిన శక్తులు రెండు వేపుల్నించీ వెంటాడుతున్నాయని గ్రహించిన నానీ కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి.

ఇలాంటి స్థితిలో అమ్మెంటే భయంతో గువ్వలా అక్కున ఒదిగి పోయేవాడు.

“రే....య్...! ఆగు” అప్పటికే స్పృహ తప్పివున్న రాందేవ్ కెమేరాలో రోలు లేదని గ్రహించిన హరి గట్టిగా కేక పెట్టాడు.

నానీ పేంట్ తడైపోయింది.

వెనుకగా వున్న ఓ చిన్న సందులోకి నాని పరుగెత్తాడు ప్రాణభీతితో.

వెనుక మృత్యుపాశాల్లా దూసుకొస్తున్న యమకింకరుల బూట్ల చప్పుడు.

* * * *

తూర్పురేఖలు విచ్చుకున్నా ఇంకా అరుణుడు అరుదెంచని ప్రభాత సమయాన....

హరిత ఒంటిపై పడుతున్న ‘షవర్’ ప్రత్యూష పవచనాలు చిలికే తుషార బిందువుల స్పర్శను గుర్తుచేసే వేళ.... గదిలో ఫోన్ రింగవుతున్న చప్పుడు వినిపించింది.

ఇంత తెల్లవారు జామునే ఎవరు ఫోన్ చేసిందీ అర్థం కాక తన నగ్న సౌందర్యానికి టర్కీటవల్ చుట్టుకుని రాయంచలా పడకగదిలోకి నడిచింది.

రిసీవర్ని అందుకుంది “హల్లో....”

“నేనే....” యశస్వి కంఠం వినిపించింది.

“వాట్ సర్‌ప్రైజ్... వేకువనే వలపు పుట్టుకొచ్చిందేమిటి” అంది గోముగా.

"వెంటనే రా హరితా....." యశస్వి గొంతు ఉత్సాహంగా పలికింది. " నీతో మాట్లాడాలి"

"ఉన్నపళాన రమ్మంటే ఎలా? "

"ఎలా వున్నానో తెలుసా?"

"చెప్పు" యశస్వి గొంతులో ఇందాకటి ఉద్వేగం లేదు.

"వింటే మగాడివయినా సిగ్గుపడిపోతావు" అల్లరిగా నవ్వింది.

"నిజమా?"

"మరేం.... నీటి తుంపరల తాకిడికి కందిపోయిన గులాబీ రెమ్మలా వున్నాను. ఉదయ పవనాల స్పర్శకి ఒళ్ళిచ్చి ఆ పులకింతలో ప్రియుడి సమాగం కోసం అంగలార్చుకుపోయే "జారినా ఇవనోమో" లాగా నగ్నంగా వున్నాను."

"ఆవిడెవరు...."

"రష్యా చక్రవర్తుల కాలంలో వలచిన ప్రియుడిచేత వెన్నతో ఒళ్ళంతా మర్ధనా చేయించుకున్న నా లాంటి ఓ ముగ్ధ"

"అంటే ఇప్పుడు స్నానానికి సిద్ధంగా వున్నావన్నమాట."

"ఆహా...సగం స్నానంలో వున్నాను. నీ స్వప్నంలోంచి సగంలోనే తేరుకుని ఇలా బయటకొచ్చాను. నీ కంఠం వినిపించగానే ఒంటిపై నుంచి జారిపడిన టవల్‌ని ఇంతవరకూ అది చుట్టుకుని విడిచిపెట్టిన నా అందాన్ని చూస్తూ నీ దురదృష్టాన్ని గుర్తుచేసుకుంటున్నాను."

"పెళ్ళికి ముందు టవల్‌ని కొనక్కరలేదు. తాంబూలం వుంటే చాలు."

"ఫర్వాలేదు.... నీకూ ఆ మాత్రం భావుకత వుంది."